# ‘భారతదేశంలో ప్రస్తుత వ్యవస్థను మార్చడానికి పోరాడుతున్న శక్తులు-ఎదుర్కొంటున్న సవాళ్ళు’ అంశంపై నేషనల్ సెమినార్

## కీ నోట్

**భారత** కమ్యూనిస్టు ఉద్యమం పట్ల శ్రద్ధతో, ఈ ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లను, సమస్యలను కనుగొనే ఒక ప్రయత్నంగా ఈ సెమినార్‌ను నిర్వహించడానికి మేము వినమ్రంగా చొరవ తీసుకొన్నాము. మనకు అభిప్రాయాలలో తేడాలు వున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితిలో ఒక సామాన్యాభిప్రాయానికి, తద్వారా పాలకవర్గాలకు, వారి విధానాలకు వ్యతిరేకంగా దీర్ఘకాలిక, నిలకడైన ఐక్య కార్యాచరణ సాగించడానికి యిలాంటి వేదిక ద్వారా మనం ఒక చోటకు రావడం తోడ్పడుతుంది. ఇది ప్రజల మధ్య, శ్రేణుల మధ్య పోరాటస్ఫూర్తిని వృద్దీపింపజేయడానికి తోడ్పడగలదని మేమాశిస్తున్నాము.

భారత సామాజికాభివృద్ధిని వలస ఆక్రమణ, పాలనలు అడ్డుకొన్నాయి, ఇంకా అడ్డుకొంటున్నాయి. బ్రిటిష్ వలస పాలకులు దేశంలో తమ పాలనను పాదుకొల్పడానికి అవసరం అనుకొన్నమేరకు భారత సమాజంలో కొన్ని మార్పులు చేశారు. ఫ్యూడలిజాన్ని పరిరక్షించారు. ఆ విధంగా భారతదేశం ఒక వలసగా, అర్ధవలసగా కొనసాగింది. విభజనతోపాటు జరిగిన అధికార మార్పిడి మనదేశంపై సామ్రాజ్యవాద దోపిడీ పెత్తనాలను కొనసాగించే పథకంతో చేయబడ్డాయి. ఆవిధంగా భారతదేశం అర్ధఫ్యూడల్, అర్ధవలస సమాజంగా తయారైంది. సి.పి.ఐ(ఎం-ఎల్) ఈ అవగాహనతో తన కృషి సాగిస్తున్నది. ఉద్యమాభివృద్ధి కోసం ప్రయత్నిస్తున్నది.

చర్చలకు తోడ్పడుతుందనే దృష్టితో ఈ కీ నోట్‌లో కొన్ని అంశాలను పేర్కొంటున్నాము.

మనదేశ ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక వ్యవస్థ స్వరూప స్వభావాలు విశాలమైన అర్థంలో కాలం చెల్లినవని, అభివృద్ధి నిరోధకమైనవనీ అనుకొంటున్నాము.

1. గ్రామీణ ఆర్థికవ్యవస్థలో ఫ్యూడల్ దోపిడీ రూపాలు పూర్తిగా అంతం కాలేదని అనుకొంటున్నాము. వచ్చిన మార్పులు ప్రధానంగా ఉపరితల నిర్మాణవ్యవస్థలకు సంబంధించి మాత్రమే అనుకొంటున్నాము.

ఫ్యూడల్ శ్రమదోపిడీ రూపాలు కొన్నిచోట్ల నాజూకు, సున్నిత రూపాలు ధరించి వున్నాయనుకొంటున్నాము.

2. కొన్ని రాష్ట్రాలలో కొట్టొచ్చినట్లు కనిపించే పెట్టుబడిదారీ దోపిడీ రూపాలు; ఆధునిక యంత్ర పరికరాలతో వ్యవసాయంవలన ఫ్యూడల్ దోపిడీ పద్ధతులు తుదముట్టించబడ్డాయని అనుకోవచ్చా?

భూస్వామ్యశక్తుల చేతులనుండి భూమి వికేంద్రీకరణ పొందిందా? మరోరూపంలో కేంద్రీకృతమై నిజమైన ఉత్పత్తిశక్తులు భూమిహీనులుగా వున్నారా? లేక భూమినుండి దూరమై మరో ఉత్పత్తి రంగంలోకి వెళ్లారా? అన్న ప్రశ్నలకు వివరణాత్మకమైన, విశ్లేషణాత్మకమైన సమాధానాలు పొందవలసి వుందనుకొంటున్నాము.

ప్రధాన ఉత్పత్తిశక్తులుగా వున్న రైతుకూలీలు, కౌలురైతులు ప్రధాన ఉత్పత్తి సాధనమైన భూమికి హక్కుదారులుగా లేని ఈ పరిస్థితిలో భూమిపై హక్కు కలిగివున్న భూయజమానుల వర్గ స్వభావం భూస్వామిక స్వభావం (ఫ్యూడల్) కలిగి గ్రామీణ పేదలను అణచివుంచే పాత్రను కలిగివున్నదను కొంటున్నాము.

భూమి సాగులో యంత్రాల పాత్ర పెరిగినందున వ్యవసాయ ఉత్పాదకతలో రైతుకూలీల పాత్ర అవసరం లేకుండాపోయిందా? ఈ విషయం చర్చించేటపుడు శ్రమ ఎన్నివిధాలుగా విభాగాలుగా విభజింప బడిందో వివరించుకోవలసివుంది; అయినప్పటికి ఫ్యూడల్ దోపిడీ అణచి వేతలు కొత్త రూపాలతో అమలుపరచబడుతూ వున్నాయనుకొంటున్నాము.

3. ఫ్యూడల్ రాజకీయం అంటే గ్రామీణ వ్యవస్థలో ఆధిపత్యశక్తుల రాజకీయాలే. ఫ్యూడల్ ఆర్థిక వ్యవస్థతో సంబంధంలేనిదిగా రాజకీయం లేదు. దీనినుసరించి సాంఘిక, సాంస్కృతిక స్థితిగతులుంటాయి.

మార్క్సిస్టు మహోపాధ్యాయులు ఈ మూడింటినీ ఏనాడూ విడదీసి చూడలేదు.

ఫ్యూడల్ ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సంస్కృతీ సాంప్రదాయాలు ఒకదానిపై మరొకటి ఆధారపడి వాటి మనుగడను సాగిస్తున్నాయను కొంటున్నాము.

4. కులం, తెగ, జాతి వ్యవస్థలకు బానిస వ్యవస్థ తాలూకు సిద్ధాంతాలు, సాంప్రదాయాలే మూలం అనుకొంటున్నాము. బానిస యజమానుల స్థానంలో ఫ్యూడల్ యాజమాన్య ఆధిపత్యం సాగింది. అది బలహీనపడి కొన్ని మార్పులు పొంది అర్ధఫ్యూడల్ యాజమాన్యం, ఆధిపత్యం కొనసాగుతూ వుంది. దీనిని రక్షించుకొనడానికే మత సంబంధమైన భావవాదం

– మాయావాదం రూపొందించబడ్డాయి. మనుష్యుల మధ్య తేడాలు అధములు, అధికులు అన్న భావన స్పష్టమైన గీతతో ఏర్పడింది. ఆర్థిక దోపిడీకి సాధనంగా రాజకీయ ఆధిపత్యం నెరపడానికి పనిముట్టుగా ఈ భావనలు నెలకొల్పబడి యుగయుగాలుగా పోషించబడుతూ వున్నాయి.

వలస పాలకులు మతపరంగా ప్రజలను చీల్చడానికి మత వైవిధ్యాలను వుపయోగించారు. భారత పాలకవర్గాలు ప్రజలను చీల్చడానికి, వారి సంఘటిత శక్తిని బలహీనపరచడానికి, నిజమైన సమస్యలనుండి వారి దృష్టిని పక్కదారి పట్టించ డానికి మతతత్వాన్ని వుపయోగిస్తున్నారు.

పాలకవర్గాలు ప్రజల పోరాటాలను, వారి నిరసన స్వరాలను అణచివేయడానికి ఫాసిస్టు పద్ధతులకు పాల్పడుతున్నారు. జాతీయ భద్రత, టెర్రరిజం, మతతత్వ భావనలు, వామపక్ష ఉగ్రవాదం అన్న సాకులను వుపయోగిస్తున్నారు.

ఈ ఫ్యూడల్ దోపిడీ – అణచివేత, వివక్ష, ఆధిక్యతలు వ్యవస్థీకృతమై పాదుకుపోయి వున్నాయి. ఈ పాదుకుపోయిన వ్యవస్థను సమూలచ్ఛేదనం ఎలా చేయాలి?

మానవతా దృక్పథంతో; ఆదర్శవాద దృక్పథంతో సంస్కరణ దృక్పథంతో కొంతమంది చేసిన ఉద్యమాలు కొంత ఊరడింపు కలిగించాయని అంగీకరించినా వ్యవస్థ సమూలమైన మార్పుకు నోచుకోలేకపోయింది.

ఫ్యూడల్ ప్రభువులు రాజ్యాలనేలుతున్న పరిస్థితుల్లో, సమాజం కునారిల్లిపోతూవున్న సందర్భంలో సామాజిక వైరుధ్యాలు ప్రజ్వరిల్లి సంఘర్షణకు గురవుతున్న కాలంలో, దేశంలోని అనేక తెగలు, అనేక ఫ్యూడల్ రాచరిక రాజ్యాలపై విదేశీ దండయాత్రలు, అణచివేత – రాజకీయ ఆధిక్యతను నెలకొల్పుకొనడానికి జరిపిన యుద్ధాలు చిన్నాభిన్న రూపంలో విశాల ప్రాంతాలలో పాతుకు పోయాయి. పోర్చుగీస్, ఫ్రెంచి, బ్రిటిష్ సామ్రాజ్య వాదులు తమ ద్రవ్యపెట్టుబడితో, సైనిక బలంతో భారతదేశం నలుమూలలా వున్న చిన్న, పెద్ద ఫ్యూడల్ రాజ్యాలను లొంగదీసుకుంటూ వచ్చిన క్రమంలో భారత రాజకీయ ఆర్థికవ్యవస్థలో ఫ్యూడల్ రాజులు, కొంతమంది తెగల పెద్దలు ఈ సామ్రాజ్యవాద శక్తులకు వత్తాసుగా, సాంఘిక పునాదిగా మారారు. సామ్రాజ్యవాదశక్తులు ఫ్యూడలిజానికి అండగా నిలచాయి. ఇది ఒక చారిత్రక పరిణామం. దీని ననుసరించి భారత సామాజికవ్యవస్థలోని అన్ని రుగ్మతలు కులమూ, మతమూ సాంప్రదాయాలూ, సంస్కృతీ – వీటిని మార్చి ఆధునిక ప్రజాతంత్ర భావజాలానికనుగుణంగా వ్యవస్థను సమూలంగా సామ్రాజ్యవాద శక్తులు మార్చకపోగా, వాటిని అలాగే కొనసాగించారు.

5. సరిగ్గా యిక్కడే భారతదేశంలో జరగ వలసిన విప్లవంయొక్క స్వభావం ఏమిటన్న సమస్య ముందుకు వస్తుంది. భారత సామాజిక రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక వ్యవస్థ సమూల మార్పుకు దోహదపడే సిద్ధాంతమేది? పరిష్కారమేది? మానవతా వాదమా? ఆదర్శవాదమా? సంస్కరణవాదమా? అన్న ప్రశ్నలు తలెత్తివున్నాయి. ఈ వాదాలకు ప్రతినిధులుగా వున్న వారి చిత్తశుద్ధినీ, వారివారి ఆలోచనాపరిధిలో చేసిన త్యాగపూరిత కృషిని గౌరవిస్తూనే పొందగలిగిన స్ఫూర్తిని స్వీకరిస్తూనే భారత ప్రజలు ఫ్యూడల్, సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడిదారీ(బూర్జువా)వర్గ అధికారం, ఆధిపత్యం స్థానంలో శ్రమజీవుల అధికారాన్ని, శ్రమజీవుల సిద్ధాంతమైన మార్క్సిజం – లెనినిజం – మావో ఆలోచనావిధానం ఆధారంగా సాధించుకోవడమన్న దానిపై కమ్యూనిస్టు ఉద్యమంలో తేడాలున్నాయి. అలాగే అభ్యుదయశక్తులకు, సంస్కరణవేత్తలకు ఇంకా ఉద్యమకారులకు – కమ్యూనిస్టు ఉద్యమ కారులకు మధ్య విభేదాలు సాగాయి. అవి మిత్రపూరితమైనవైనా ఉద్యమాలు ఉచ్ఛస్థాయికి వచ్చినపుడు ఒకదాని కొకటి ఆటంకంగా వచ్చి నపుడు వైషమ్య స్వభావం సంతరించుకున్న అనుభవాలూ వున్నాయి.

ఇక్కడ ప్రశ్న ఏమంటే, మనం సిద్ధాంత, రాజకీయ తేడాలను వాస్తవికంగా, వున్నవి వున్నట్లుగా చూడలేమా?; ఆరోగ్యవంతమైన, ప్రజాతంత్రయుతమైన వాతావరణంలో చిత్తశుద్ధితో వాటిని చర్చించే ప్రయత్నం చేయలేమా? విబేధాలను పరస్పరం దూషించుకొనడం, పేర్లు పెట్టుకొనడం అనే స్థితికి దిగిపోనివ్వకుండా వాటిని అధిగమించే ప్రయత్నం చేయలేమా?

ప్రపంచంలో విప్లవాలకు కార్యక్రమానికి సంబంధించిన మౌలిక డాక్యుమెంటు అయిన 'కమ్యూనిస్టు ప్రణాళిక' విషయంలో కమ్యూనిస్టులు ఎక్కడ వున్నారు?

యూరప్‌లో ప్రజాతంత్ర విప్లవాలకు నాయకత్వం వహించిన బూర్జువావర్గం ఇక ముందు నాయకత్వ మొహించలేదనీ, శ్రామికవర్గమే ప్రజాతంత్ర విప్లవ సంఘటనకు నాయకత్వ మొహించగలదనే నిర్ధారణకు లెనిన్ నాయకత్వాన రష్యా కమ్యూనిస్టు పార్టీ బోల్షివిక్ వచ్చింది. దానికి తగిన ఎత్తుగడల ననుసరించి శ్రామికవర్గ నాయకత్వాన సోవియట్ రిపబ్లిక్‌ని నెలకొల్పింది. దీనికి ముందు పారిస్‌కమ్యూన్ సందర్భంగా బూర్జువావర్గం నిలబడలేక పోవడానికి సంబం ధించిన అనుభవం కూడా వుంది.

ఈ అనుభవం నుంచి చైనా కమ్యూనిస్టు పార్టీ తనదేశంలో ప్రజాతంత్ర విప్లవం శ్రామికవర్గ నాయకత్వాన రైతాంగం, ఇతర చిన్న ఆస్థిపర వర్గాల అండతో సాగుతుందని నిర్ధారణకు వచ్చారు. అది పాత యూరప్ ప్రజాతంత్ర విప్లవాలలాగ కాక బూర్జువావర్గం నాయకత్వానకాక శ్రామికవర్గ నాయకత్వాన నూతన ప్రజాస్వామిక విప్లవంగా సాగించారు. ఈ అనుభవం జాతీయ విముక్తి పోరాటాలు జరుగుతున్న వ్యవసాయం ప్రధాన ఉత్పత్తి సాధనంగా వున్న ఆసియా దేశాలన్నింటికి వర్తిస్తుందనే అవగాహనకు పునాదిగా వుంది.

కనుక భారతదేశంలో సామ్రాజ్యవాదం తన పెట్టుబడిదారీ దోపిడీ సాగడానికి భారతదేశ ఫ్యూడల్ వ్యవస్థను సాంఘిక పునాదిగా వుంచుకొని దళారీ బూర్జువాల ద్వారా నయావలస దోపిడీ పద్ధతుల ననుసరిస్తున్నదనే అవగాహన ముందుకు వచ్చింది. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో విభేదాలకు ఆరంభమిదేననుకొంటున్నాము. భారతవిప్లవం ప్రజాతంత్ర విప్లవంగా ఇంకా సాగవలసివున్నదన్న శక్తులకు–ప్రజాతంత్ర విప్లవం పరిపూర్తయిపోయింది. ఇక సాగవలసింది సోషలిస్టు విప్లవమేననే శక్తులకు మధ్య తేడాలున్నాయి.

ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలు, సోషలిస్టు విప్లవ కర్తవ్యాలు వేరుగా వుంటాయి. కనుక ప్రజాతంత్ర విప్లవకర్తవ్యాల పరిపూర్తిద్వారా సోషలిజంలోకి వెళ్తామన్న వారి దృక్పధానికి – సోషలిజం సాధనకోసం కృషిచేస్తున్న వారి దృక్పధానికి మధ్య తీవ్రమైన తేడాలున్నాయి.

భారతదేశం నేడు మరింత నగ్నంగా సామ్రాజ్యవాద దోపిడీకి గేట్లు బార్లా తెరచివుంచింది. భారతదేశానికి మేలు చేకూరుస్తున్నాయని చెప్ప బడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధిపేరిట తీసు కొంటున్న చర్యలన్నీ సామ్రాజ్యవాద ప్రయోజనాలను నెరవేర్చే పనితో ముడిబడి వున్నాయనీ, ఫ్యూడల్ ఆర్థికదోపిడీ ఫ్యూడల్ పద్ధతులకు ఆధునిక పద్ధతులు జోడించి సాగుతున్నాయనీ, పాతఫ్యూడల్ శక్తులు ఫ్యూడల్ ఆర్థికదోపిడీతోబాటు; పెట్టుబడుల ద్వారా పెట్టుబడిదారీ దోపిడీ పద్ధతులనూ; ప్రభుత్వ ఖజానా (ప్రజల ఖజానా)ను బ్యురోక్రసీ (ఉన్నతాధికార వర్గం)తో చేతులు కలిపి దోపిడీ చేస్తున్నారనీ అనుకొంటున్నాము.

ఈ ఆర్థిక దన్ను, రాజకీయాధికారాన్ని కైవశం చేసుకోవడానికీ, రాజకీయాధికారం ఆర్థికంగా మదపటేనుగులాగా మారడానికి దోహదపడు తోంది. దీనితోపాటు కాపాడబడుతూ వస్తున్న కుల, మత బేధాలు సాంఘిక, సాంస్కృతిక, సాంప్రదాయాలు వారి ఆర్థికదోపిడీకి, రాజకీయ ఆధిపత్యానికి, సాంఘిక దురహంకారానికి సాధనంగా ఉపయోగపడుతున్నాయి. కనుక మరింత వక్కాణింపుతో మానవతావాద, ఆదర్శవాద, సంస్కరణవాద ఉద్యమాలు సమాజం సమూల మార్పుకి దోహదపడలేవని అనుకొంటున్నాము. నేటి వ్యవస్థలో ప్రభుత్వాలు–ఏ పార్టీ ప్రభుత్వమైనా రూపొందించబడిన ప్రజోపయోగకర పధకాలపేరిట ప్రజలను ఏమారుస్తున్నాయనుకొంటున్నాము.

కమ్యూనిస్టు ఉద్యమశక్తులు–ప్రజాతంత్ర విప్లవశక్తులు, సోషలిస్టు విప్లవశక్తులు వీరంతా నేడు వామపక్ష శక్తులుగా పరిగణింపబడుతున్నారు. చట్టంలో రూపొందించబడిన ప్రజాతంత్ర హక్కుల కోసం పోరాటం, సమతాసిద్ధాంతాల ప్రచారం, మార్క్సిజం ప్రాతిపదికగా వర్గపోరాట చైతన్యాన్ని ప్రజలకు కల్పించడంలాంటి విషయాలలో విబేధించే విషయాలు వుండకూడదనుకొంటున్నాము.

ప్రభుత్వం చేసిన భూసంస్కరణ; అటవీ హక్కుల, కార్మికహక్కుల, దళిత హక్కుల, స్త్రీల హక్కుల చట్టాలను సరిగ్గా, సక్రమంగా అమలు జరపమని ప్రభుత్వాలను డిమాండ్ చేయడం, ఈ హక్కుల సాధనకు ఆయా వర్గాల, సెక్షన్ల ప్రజలను ఆందోళనోద్యమాలు చేయమని కోరడంలో కమ్యూనిస్టులకు, సోషలిస్టు విప్లవ దృక్పధంగల కమ్యూనిస్టులకూ, సోషలిస్టులకూ విభేదాంశాలేమీ వుండకూడదనుకొంటున్నాము. ఈ కార్యక్రమం ఐక్యకార్యాచరణ వేదికలకు కనీస ప్రాతిపదికగా వుంటుంది.

అలాగే భారత ఆర్థిక వ్యవస్థలోకి సామ్రాజ్య వాదుల చొరబాటు తద్వారా రాజకీయరంగాన్ని తమ అదుపులో వుంచుకొనడాన్ని వ్యతిరేకించడం ప్రపంచాధిపత్య వ్యూహానికి కట్టివేయడం కూడ పైశక్తులన్ని ఒకే వేదికమీదకు రావడానికిగూడ కనీస ప్రాతిపదిక కాగలదు. సామ్రాజ్యవాదం అంతర్జాతీయ రంగంలో చేసే బెదిరింపులు, దురాక్రమణలు, యుద్ధాలను వ్యతిరేకించడంలో కూడా విభేదం వుండకూడదు. జాతీయవాదం–శుద్ధజాతీయవాదం –ఉన్మాద జాతీయవాదం ఈ మూడు రకాలలో మార్క్సిజం–లెనినిజం ప్రాతిపదికగా జాతి, జాతుల పోరాటాలగురించి కమ్యూనిస్టు విప్లవకారులకు ఒక దృక్పధముంది. బహుశా ఈ సమస్యపై భావైక్యత ప్రస్తుతం లేదనుకోవచ్చు.

అలాగే ప్రాంతీయత – ప్రాంతీయతత్వం ఒకటి కాదు. ఒక ప్రాంత ప్రజల ఆర్థిక, సాంఘిక అభివృద్ధిని కోరుకునే ఉద్యమాలను బలపరచడం, నిర్వహించడంలో కమ్యూనిస్టులకు ఏకాభిప్రాయం వుంది. అదే సందర్భంలో ప్రాంతీయతత్వం, ప్రాంతీయ ఉన్మాదంగా మార్చే దృక్పధానికి వ్యతిరేకం. ఈ విషయంలో కూడా స్వల్పమైన తేడాలతో ఏకీభావం వుండవచ్చు.

శ్రామికవర్గ శక్తులు అధికారంలోకి రావడానికి ఏ పోరాట రూపం సరిపడుతుందన్న విషయంలో తేడాలున్నాయి. ఈ విషయంలో ఎవరి దృక్పధాల కనుగుణంగా వారు పనిచేసుకుంటూ విశాలమైన భావనతో ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలను నిర్మించవచ్చు. ప్రచారం – ఆందోళన – పోరాటం – రాజకీయ చైతన్యం అన్న పోరాట సూత్రాల ప్రాతిపదికపై ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ఆందోళనోద్యమాలను నిర్వహించలేమా?

భారత రాజ్యాంగం, న్యాయసూత్రాల విషయంలో ఎవరి దృక్పధాలు వారికి వున్నప్పటికి ఈ ఆరు దశాబ్దాల కాలంలో ఇవి అత్యంత ధనాఢ్యవర్గాలకు ఎలా ఉపయోగపడుతున్నాయో, ప్రజానిరసన, ఆందోళనల ఫలితంగా సామాన్యులకు కూడా అప్పుడప్పుడు ఎలా ఉపయోగపడుతున్నాయో వీటినుండి ప్రధానంగా ప్రయోజనం పొందుతున్న వర్గాలే వీటిని దినదినం ఏవిధంగా నామమాత్రం, అపహాస్యం చేస్తున్నాయో అనుభవం చూపెడ్తున్నది. ఈ విషయంలో వున్న తేడాను కూడా అధిగమించ డానికి తోడ్పడవచ్చును. రాజ్యాంగం యిచ్చిన హామీలు, న్యాయచట్టాలు కల్పిస్తున్న నమ్మకాలు సామాన్య ప్రజలనేకాక పురోగామి శక్తులను కూడా భ్రమలలో వుంచుతున్నాయి.

భారత సమాజ మార్పుకోసం సంఘర్షణ పడుతున్న శక్తులు ఎదుర్కొంటున్న సవాళ్లను ఈ వెలుగులో పరిశీలించుకోవలసి వుంటుందని అనుకొంటున్నాము.

**1. ప్రధాన శత్రువులలో ఒకటయిన ఫ్యూడలిజం సమస్య; దాని ఫ్యూడల్ రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిస్థితులను మార్పు చేయడానికి సంబంధించిన సమస్య.**

**2. సమస్త రంగాలలో తిష్టవేసి కూర్చున్న సామ్రాజ్యవాదాన్ని ప్రధాన శత్రువులలో ఒకటిగా నిరూపించి నిలబెట్టే సమస్య; సామ్రాజ్యవాద దోపిడీని ప్రస్తుత దశలో ఎదుర్కొనే సమస్య.**

**3. వ్యవసాయక సమస్య అంటే ప్రధాన ఉత్పత్తి సాధనంగా కోట్లాది ప్రజల తిండి, బట్ట తదితర సమస్యలను తీర్చే భూమి యాజమాన్యం సమస్య.**

**4. కోట్లాది ప్రజల అవసరాలను తీరుస్తూ, కోట్లాది ప్రజలకు ఉపాధిగావున్న పారిశ్రామికరంగం దళారీ పెట్టుబడి, విదేశీపెట్టుబడి కబంధహస్తాలలో చిక్కుకున్న సమస్య.**

**5. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల శ్రామికులు సృష్టిస్తున్న సంపదల పంపిణీ సమస్య.**

**6. భారత ప్రజల సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక స్థాయిని పెంపొందిచడానికి పురోగామిశక్తులయిన కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు విప్లవకారులు, సోషలిస్టులు, అభ్యుదయ పురోగామి శక్తులను ఒకే త్రాటిపైకి తెచ్చే సమస్య.**

**7. తాత్విక, రాజకీయ, సిద్ధాంతపర విషయాలపై తేడాలను ప్రజాతంత్రయుతమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో చర్చించడం, వాటి పరిష్కారంకోసం ప్రయత్నించడానికి సంబంధించిన సమస్య. ఐక్యకార్యాచరణ వేదికలను సమన్వయ పూర్వకంగా, సమానత్వ ప్రాతిపదికపై నిర్వహించే సమస్య.**

**8. పోరాట రూపాలను, ఎవరి పద్ధతిలో వారు చేస్తున్న పోరాటాలను ఎలా చూడాలి అన్న సమస్య, సంఘీభావం ప్రకటించే సమస్య. సంఘీభావం అంటే ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించడంతో సమానం చెయ్యకూడదని, ప్రజల పోరాట నినాదాలు, ఆకాంక్షల సాధనకు అండగా రాజకీయంగా, భౌతికంగా నిలబడవలసివుంటుందన్న సమస్య. ఇవిగాక నిత్యజీవనరంగంలోని అనేక సమస్యలపై యాదృచ్ఛిక ఉద్యమాలు వస్తున్నాయి. మతోన్మాద దాడులు, కులాధిక్యదాడులు, ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలు, స్త్రీలపైన, బాలికలపైన లైంగిక వేధింపులు, రైతుల ఆత్మహత్యలు, విద్యార్థినులు, మహిళా వృత్తిదారులపై, ఉద్యోగులపై జరుగుతున్న అవమానకర వేధింపులులాంటి సమస్యలు ఎన్నో వున్నాయి. నిత్య నిరంతరాయ సమస్యలపై ఎలా ఐక్యశక్తిని ప్రదర్శించాలి.**

ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం నానాటికీ తీవ్రతరమవుతున్నది. అధిగమించలేనిదిగా యిది తయారైంది. ఇది శ్రామిక ప్రజల మధ్య అసంతృప్తి, నిరసన పెరగడానికి దారితీసింది. అంతర్జాతీయ కేంద్రం లేకపోవడం, మార్క్సిజం – లెనినిజంపైన సిద్ధాంత, రాజకీయ దాడులు సాగుతూండడం అన్నవి కమ్యూనిస్టు వుద్యమం ఎదుర్కొంటున్న కొన్ని అవరోధాలు.

భారత సమాజాన్ని ముంచెత్తిన సర్వవ్యాపిత సంక్షోభం, వివిధ సెక్షన్ల ప్రజల మధ్య పెరుగుతున్న అసంతృప్తి, పోరాటాలు ప్రజలు విప్లవాత్మక మార్పు వైపుగా సాగడానికి ఎన్నో అవకాశాలను అందిస్తున్నాయి.

అనుకూల పరిస్థితులను వినియోగించు కొనడంలో, అననుకూలతలను అధిగమించడంలో భారత కమ్యూనిస్టు ఉద్యమానికి సంపద్వంతమైన అనుభవాలున్నాయి. మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనా విధానంపట్ల, నిర్దిష్ట పరిస్థితులకు దాన్ని అన్వయించడంపట్ల మనకున్న మొక్కవోని అంకిత భావం భారత సమాజ మార్పుకోసం పోరాడుతున్న శక్తుల ఐక్యతకు దారిని సుగమం చేస్తాయని మేము ఆశిస్తున్నాము.

**విప్లవాభివందనలతో**

**కేంద్రకమిటి**
**సి.పి.ఐ(ఎం-ఎల్)**
**(విశ్వం)**
**ప్రధాన కార్యదర్శి**

**ఆగస్టు 21, 2018**

**ంంంం**